
## కామెడీకథ




సారూ... డైరెక్టర్ సారూ! అయ్యా... ప్రొడ్యూసర్ సారూ! తెలుగులో సినిమా కథలు లేవని అట్లా గుండెలు బాధుకుంటారు దేనికి సారూ?! అరవం నుంచో, మళయాళం నుంచో, ఇంకేదో మరేదో ఏదేదో భాషలోంచో డబ్బింగ్ చేసి, కాపీ కొట్టి సినిమాలు తీయాల్సిన ఖర్మ మీకేంటి సారూ!?

మా తెలుగులో బోలెడంతమంది రచయితలమున్నాం. మీకు 'కావాల్సిన' కథలు బాత్‌రూంకెళ్ళినంత ఈజీగా రాసి పడేయగలం. ఎంతకంటే అంతకు, ఆఖరికి మీరు ఫ్రీగా తీసేసు కున్నాసరే మాకేమీ అభ్యంతరం లేదు. అలాంటప్పుడు ఎక్కడె క్కడి నుంచో సిన్మాకథలు దిగుమతి చేసుకోవలసిన ఖర్మ మీకేంటి సారూ! ఏమిటి! నమ్మకం కుదరటం లేదా? అయితే సరే. మచ్చుకి ఇప్పుడో కథ చెబుతాను వినండి.

### గ్యారంటీ

సారూ! ఇప్పుడు నేను చెప్తున్న ఈ కథ సిన్మా తీస్తే అది సూపర్ హిట్టయి కూచుంటుంది. మా తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాని చూసి చూసి తరించి చావకపోతే మీమీద ఒట్టు! మీ భోషాణాలన్నీ 'కోట్ల'తో నిండకపోతే నేను మా తెలుగు ప్రజల రాజధానిలో సివిక్‌సెన్స్‌తో తిరిగినంత పాపం చేసినట్లు! గ్యారంటీ!

### హీరో

మాటి మాటికీ లుంగీ పైకెత్తుకుని ఫైట్స్ చేయటం, ఉన్నట్టుండి లుంగీ విప్పదీసి నిక్కరు చూపించటం వంటి వెకిలి వేషాలేవీ మన హీరో వెయ్యడు. ఎందుకంటే మొదటి నుంచి చివరి వరకూ గోచీ మాత్రమే కట్టుకుంటాడు. ఒకే ఒక్క గోచీ. ఆ గోచీని విప్పడు, ఉతకడు, మార్చడు. సాంగుల్లో మాత్రం సూట్లూ, బూట్లూ వేసుకుంటాడనుకోండి. అది వేరే సంగతి.

చెత్తకుండీల్లోంచి పాతకాగితాలు, ప్లాస్టిక్ బ్యాగులు ఏరుకొని రారాజులా జీవించే రోల్ మన హీరోది. అతడికి ఎనిమిది మంది చెల్లెళ్ళు ఉంటారు. చిన్నప్పట్నుంచీ అందర్నీ అతడే పెంచి పోషిస్తాడు. అమ్మా నాన్నా ఉండరు. పక్కా అనాథ టైపు.

### హీరోయిన్

హీరోయిన్‌కి చిన్నప్పట్నుంచి బట్టలంటే తెగ ఎలర్జీ. దానికి ఓ బలమైన కారణముంటుంది. ఆ పాయింట్‌ని చివరివరకూ సస్పెన్స్‌గానే ఉంచుతాం. బట్టలంటే తెగ ఎలర్జీ కాబట్టి టైలర్‌షాపు దగ్గర దొరికే గుడ్డపీలికలు చుట్టుకొని ఎక్కడికి పడితే అక్కడికి పోతుంటుంది. తన ఏసీ కారు దిగితే చాలు... ఎవడో ఒక మగాడితో పేచీ పడుతుంది. ఎవ్వడ్నీ లెక్క చెయ్యదు. బట్టల ఎలర్జీలాగే 'మగపురుగుల' ఎలర్జీ కూడా బాగానే ఉంటుంది. మగ కుక్కనీ, పిల్లిని, కోతిని దేన్ని చూసినా సరే ఆమెకు కంపరమే. మగజాతి లేని ప్రపంచం కోసం అదే పనిగా కలవరిస్తుంటుంది. ఇక ఈ హీరోయిన్‌గారి నాన్న సంగతి చూస్తే ఆయన మహా కోటీశ్వరుడు. కోట్లలోనే పుట్టి కోట్లలోనే పెరుగుతాడు. ఎటుచూసినా కోట్లే. ఎప్పుడు చూసినా కోట్ల యావే. (ఈ 'దరిద్రం' భరించలేకే ఆయన భార్య హీరోయిన్ని కని హరీమంటుంది) ఏ చింతలూ లేని



ఆ మహాత్ముడికి ఎప్పుడూ ఒకే చింత... తన ఏకైక గారాల కూతురికి ఇంత నీచ నికృష్టమైన (బట్టల) ఎలర్జీ ఏమిటా అని! ఈ ఎలర్జీ పోగొట్టే మొనగాడికి-వాడు గోచీకి గతిలేని వాడైనా సరే-వాడికి తన గారాల కూతురిని ఇచ్చి పెళ్ళి చేస్తానని ఆ కోటీశ్వరుడు వీరప్రతిజ్ఞ చేస్తాడు... ఇదీ హీరోయిన్ బ్యాక్ గ్రౌండ్.

## టైలర్ శివ

అచ్చు తప్పు కాదు కరెక్టే. టైగర్ కాదు టైలరే. మన సినిమాలో విలన్‌గాడే టైలర్ శివ. ఇతడొక బస్తీలో సంవత్సరాల తరబడి ఓ టైలర్‌షాపు నడిపిస్తుంటాడు. ఆ షాపుకొచ్చే ఆడవాళ్ళందరినీ పాడు చేస్తుంటాడు. అతడి షాపుకి ఎక్కడెక్కడి నుంచో అమాయకులు వస్తుంటారు. కొందరు గుడ్డలో నీరు గుడ్డలోనే కుక్కుకుని వెళ్ళిపోతే మరికొందరు ఆ షాపుముందే ఉన్న బావిలో దూకి చనిపోతుంటారు. అయినా పాపం కొత్తవాళ్ళు వస్తూనే వుంటారు. తను పాడు చేసిన ఒకో అమ్మాయికి ఒకో గుడ్డ పీలిక చొప్పున టైలర్ శివ తన షాపు పక్కన పడేస్తుంటాడు. ఆ గుడ్డపీలికలు ఓ పెద్ద గుట్టలా తయారవుతాయి. హీరోయిన్ ప్రతిరోజూ ఆ గుట్ట దగ్గరికి వచ్చి కొన్ని పీలికలు ఏరుకుని కట్టుకుంటుంది. తను పారేసిన పీలికలే ఏరుకుని మానం కాపాడుకుంటుంది కాబట్టి ఆవిడ తననే పెళ్ళి చేసుకోవాలని వాదిస్తాడు టైలర్ శివ. చాలా గొప్ప లాజిక్. కోర్టులో కూడా దీనికి తిరుగుండదు. కానీ హీరోయిన్ అందుకు ఒప్పుకోదు. అయితే ఆవిడ తననెలా పెళ్ళి చేసుకోదో చూస్తానని, తనను కాక ఇంకెవరిని చేసుకున్నా బతికి బట్ట (?) కట్టనివ్వననీ, తాను కూడా కట్టుకోనని పట్టుబడతాడు టైలర్ శివ.

## బాలనటుడు

మరేం కంగారు పడకండి. మన సినిమాలో సెకండ్ హీరోయిన్ కూడా ఉంటుంది. కానైతే ఆవిడకంటే ఆ బాలనటుడికే ఎక్కువ ప్రాధాన్యత వుంటుంది. ఇప్పుడొచ్చే సినిమాల్లోని కుర్రకుంకలకన్నా మన కుర్రకుంక మహాముదురు. మన సిన్మాలోని కుర్రకుంక ప్రత్యేకత ఏమిటంటే వాడు పరిగెత్తడు, నడవడు, కనీసం పాకే దశను కూడా చేరుకోడు; ఇంకా ఉయ్యాల్లో ఉన్న దశే. ఉయ్యాల్లో ఉంటూనే (అంత చిన్న వయసులోనే) హీరో హీరోయిన్లకి, అలాగే దారంట పోయే అడ్డమైన దానయ్యలకి ప్రేమ, పెళ్ళి, పిల్లలు, సంసారం వంటి విషయాలపై అనర్గళంగా ఉపన్యాసాలిస్తుంటాడు. ఆఖరికి డా.సమరం స్థాయి జవాబులను కూడా అవలీలగా ఇచ్చేస్తుంటాడు. ఈ కుర్రకుంక వాగే... సారీ... చెప్పే కొన్ని 'సూపర్ డైలాగు'లకి థియేటర్లు చప్పట్లతో ఈలలతో మారుమ్రోగిపోతాయి. (అంత గొప్ప డైలాగులు చెప్పిస్తామన్న మాట)

## ఇతర పాత్రలు

హీరో ఎదురింట్లో ఓ చిన్న పూరి గుడిసెలో ఒక నిరు

**కె.ఆదర్శ సామ్రాట్**

పేద ముసలమ్మ ఉంటుంది. ఈవిడ సినిమా ఎండింగ్‌లో హీరో తల్లిగారని తేలుతుంది. ఈ ముసలమ్మ, కుర్రకుంక అక్కగారు (సెకండ్ హీరోయిన్) ఒక కామెడీ నటి, ఆమె నల్గురు మొగుళ్ళు, మళ్ళీ ఆ ఒక్కో మొగుడికి ఇద్దరేసి పెళ్ళాలు, హీరోగారి చెంచా, విలన్‌గారి చెంచా... వీరంతా సినిమాలోని ఇతర ముఖ్యపాత్రలు.

## పాటలు-సంగీతం

ఇది కథకు సంబంధించని అంశం కాకపోయినా ఈ విషయం కూడా ఒక సారి ప్రస్తావించేసుకుంటే మంచిదని నా అభిప్రాయం. *(దీని మూలంగా మన కథకు మరింత బలం చేకూరుతుంది)* న్యూస్ పేపర్‌లోని హెడ్డింగులన్నీ కలిపి ఒక పాట, సంతలో విన్పించే అరుపులన్నీ కలిపి ఒక పాట, భార్యాభర్తల బెడ్‌రూం మాటలన్నీ కలిపి ఒక పాట, పిచ్చాసుపత్రిలోని పిచ్చివాళ్ళ కూతలన్నీ కలిపి ఒక పాట... ఇలా మన సినిమాకు పసందైన పాటల్ని సమకూరుస్తాం. ఇక ఓ లక్ష డబ్బారేకుల్ని మరో లక్ష (రకాల) ఇనుపరాడ్లతో బాదితే వచ్చే అద్భుతమైన సంగీతం మనకెలాగూ ఉంటుంది. ఈ పాటలు, సంగీతంతో కనీసం సగంమంది తెలుగువారైనా గంగవెర్రులెత్తకపోతారా, మన పంట పండించకపోతారా. కాబట్టి సారూ... ఈ విషయంలో మీరు నిశ్చింతగా ఉండ వచ్చు.

## అసలుకథ

ఇక ఇప్పుడు అసలు కథకి వద్దాం.

హీరోగారి ఆఖరి చెల్లెలు ఓ 'కోన్‌కిస్కా గొట్టం' గాడ్ని ప్రేమిస్తుంది. సదరు కోన్‌కిస్కా ఆమెకు లవ్ లెటర్ ఇస్తుండగా చూసిన హీరో అతగాడ్ని చెవులు మూసి చావబాది అపోలో ఆస్పత్రిలో చేర్పిస్తాడు. ఆనక తీరిగ్గా ఇంట్లో నిలబడి తన చెల్లెలికి ఓ సుదీర్ఘమైన ఉపన్యాసం ఇస్తాడు. ''మనమేమిటి! మన వంశగౌరవం ఏమిటి!!'' అంటూ సదరు లెక్చర్ మొదలవుతుంది.

''... మన అమ్మని హత్య చేసినవాడికి మీ పెద్దక్కనిచ్చి పెళ్ళి చేశాను. నాన్నని తెగనరికినవాడికి రెండోదాన్ని కట్టబెట్టాను. అమ్మమ్మను చంపినవా డికి మూడోదాన్ని, తాతయ్యను కడతేర్చినవాడికి నాల్గోదాన్ని ఇచ్చి పెళ్ళి చేశాను. ఐదో దాన్ని, ఆరోదాన్ని కూడా మన ముఖ్య బంధువులను చంపినవా రికే ఇచ్చి చేశాను. ఎందుకంటే అదే మన వంశాచారం. ఆ ఆచారాన్ని కాదని ఎవరినీ చంపని వాడికిచ్చిన ఏడోదాని బతుకేమయ్యిందో చూశావుగా'' అంటూ చెల్లెలి చిన్నక్క-కమ్-వితంతువుని చూపిస్తాడు. ''చెప్పు... నీక్కూడా ఇదే గతి పట్టాలా?'' అంటూ రంకెలేస్తాడు.


కొన్ని క్షణాలు చచ్చేంత నిశ్శబ్దంగా ఉండి, గద్గద స్వరంతో మళ్ళీ ఇలా అంటాడు- ''కోన్‌కిస్కాలాంటి మంచివాడ్ని చేసుకోవటం మంచిది కాదమ్మా. అది మనకు అచ్చిరాదు. నీ ఈ అన్నయ్య మీద నమ్మకముంచి కొంచెం ఓపిక పట్టు.''

''ఇంకా చంపటానికి మన వంశంలో ఎవరు మిగిలున్నారని అన్నయ్యా'' చెల్లెలు ఆవేశపడు తుంది.

''ఎందుకు లేరు. మీ అక్కలూ, బావలూ లేరా. వాళ్ళు చావటానికి ఒప్పుకోకపోతే నేను లేనా. నేను చచ్చా ననుకున్నావా అమ్మా'' అంటాడు హీరో బాధగా.

*(హాలంతా చప్పట్లతో మార్మోగి పోతుంది. గ్యారంటీ)*

ఇక ఆ క్షణం నుంచి చిన్న చెల్లెలికి హీరో, సంబంధాలు వెతుకుతుం




టాడు. ఇలా తిరుగుతుండగా తుండగా ఉండగా ఒకానొక శుభదినాన గుడ్డ పీలికల హీరోయిన్ తారసపడుతుంది.

''ఛీఛీ... ఆడదానివై ఉండి ఇలా గుడ్డపీలికలు కట్టుకోడానికి (?) నీకు సిగ్గేయటం లేదూ?'' అంటాడు హీరో.

''మగాడిగా ఉండి ఆడదానివంక చూడ్డానికి నీకు సిగ్గూ ఎగ్గూ లేదూ?'' హీరోయిన్ గయ్యిమంటుంది.

''మాటలు నేర్చిన కుక్క ఉస్కో అంటే ఉస్కో అందిట''

''దున్నపోతు కూడా అంతేనట''

*(ఇలా ఓ పావుగంట సేపు జనరంజకమైన డైలాగులు చెప్పిస్తాం. హాలంతా ఈలలు, చప్పట్లతో నిండిపోతుంది)*

చివరకు ''ఏదో ఒకరోజు నీతో చీర కట్టించకపోతే నేను గోచీ గోపయ్యనే కాదు'' అంటూ హీరో వీర ప్రతిజ్ఞ చేస్తాడు.

''నువ్వు కట్టించిన చీర నేను క్షణంలో విప్పిపారెయ్యకపోతే నేను గుడ్డపీలి కల గుండమ్మనే కాదు'' మాటకు మాట బదులిస్తుంది హీరోయిన్.

ఇదంతా చెత్తకుండీ పక్క నుంచి గమనించిన బాలనటుడి అక్క కమ్ సెకండ్ హీరోయిన్ క్షణంలో హీరోతో ప్రేమలో పడిపోతుంది. అయితే ఆమె ఈ విషయాన్ని ఉయ్యాల్లో ఉన్న తమ్ముడికి తప్పించి ఇంకెవరికీ చెప్పదు. నెంబర్‌వన్ మూగ ప్రేమన్నమాట.

ఒకనాడు బ్రాందీషాపులోని బ్రాందీనంతా తాగిపారేసిన హీరో తన మన సులోని మాటను 'చెంచా'తో చెబుతాడు. గుడ్డపీలికల గుండమ్మతో తను చెత్తకుండీ లోతు ప్రేమలో పడ్డానని చెప్పి బావురుమంటాడు. చెంచా ఓదార్చి అతడికి కొన్ని ప్రేమ చిట్కాలు చెబుతాడు. అయితే మన హీరో ఎన్ని చిట్కాలు ప్రయోగించినా గుండమ్మ అతడ్ని అసహ్యించుకుంటుందేగాని ప్రేమించదు.

''... ఎన్ని సినిమాల్లో చూడలేదు గురూ... హీరోయిన్ని హీరో సాచి లెంపకాయ కొట్టగానే ప్రేమలో పడిపోతుంది. ఇంత చిన్న విషయాలు కూడా నేను చెప్పాలంటే ఎలా?'' అంటాడు చెంచారావు.

అంతే. గుడ్డపీలికల గుండమ్మ దవడ పళ్ళు ఊడిపడిపోయేలా హీరో ఆవిడ్ని సాచి కొడతాడు. విచిత్రం! కొట్టినాసరే గుండమ్మ ప్రేమించదు. పైగా కట్టుడు పళ్ళు పెట్టించుకుని, హీరోపై పగ సాధించటమే జీవితంగా బతుకు తుంటుంది.

దాంతో హీరోకి గంగవెర్రులెత్తి చెంచాని చావగొట్టి చెవులు మూస్తాడు. పూర్తిగా చంపేయబోతున్న తరుణంలో సదరు చెంచాగారి ప్రేయసి వచ్చి హీరోని దులిపేస్తుంది.

''నువ్వు ఎన్నో ఏళ్ళ నుంచి చెత్తకాగితాలు ఏరుకుంటూ బతుకుతున్నావు. ప్రతిరోజూ ఎన్నెన్నో చెత్తకుండీలను చూస్తున్నావు. అయినా ఒక చిన్న చెత్త ఆలోచన కూడా నీకు రాలేదంటే ఏమనుకోవాలి? ఆడదాని మనసునెలా జయించాలో తెలియనప్పుడు ఎంత చెత్తబతుకు బతికి ఏం లాభం? ఎన్ని చెత్త కుండీలు కెలికి ఏం లాభం?'' అని జాడిస్తుంది.

హీరోకి తుప్పంతా వదిలినట్లవు తుంది.

''చెల్లెమ్మా... ఆ చెత్తైడియా ఏదో చెప్పి పుణ్యం కట్టుకో చెల్లెమ్మా, ఇవి చేతులు కావు, కాళ్ళనుకో'' అంటూ నడుమూ, జబ్బలూ పట్టుకుంటాడు.

''ఎందుకు గోపీ ఆవిడ్ని అంతగా బతిమాలుతావు? ఆ ఐడియా ఏదో నేను చెబుతాను'' అప్పటివరకు కన్పిం చని సెకండ్ హీరోయిన్ టక్కున

ముందుకొస్తుంది. ఆమె కళ్ళు నిండా నీళ్ళు!

అంతకుముందే (బాలనటుడి ద్వారా) ఆమె ప్రేమకథను తెలుసుకొని ఉన్న చెంచా ఆమెకు తన రెండు చేతులూ జోడించి కళ్ళద్దుకుంటూ వెళ్ళిపోతాడు.

''నేను ఎన్నెన్నో సినిమాల్లో ఎన్నెన్నో ప్రేమలు చూశాను. కాని ఇంత పవిత్రమైన ప్రేమని, గొప్ప ప్రేమని ఎక్కడా చూడలేదు'' అని ప్రేక్షకులతో అంటాడు.

☆☆☆

ఇప్పటివరకూ జరిగిన కథలో ఓ నాల్గైదు పాటలు, ఓ మూడోనాల్గో ఫైటులూ పెడతాం. జనాన్ని పిచ్చిపిచ్చిగా నవ్వించే (దిక్కుమాలిన) కామెడీ ట్రాక్ ఎలాగూ ఉంటుంది.

ఇక ఇప్పుడు కథ క్లైమాక్సుకు చేరుకోవలసిన టైం వచ్చేస్తుంది. క్లైమాక్సులో... 1. హీరో ప్రేమ ఫలించాలి. 2. హీరో చివరి చెల్లెలికి సంబంధం కుదరాలి. 3. విలన్‌గాడికి తగిన శాస్తి జరగాలి. క్లైమాక్సులో ఇవన్నీ ఒకేసారి జరిగిపోతాయన్నమాట. అంటే ప్రేక్షకులకి కావలసినంత సస్పెన్స్ ఉంటుంది.

''ఆడది నిన్ను ప్రేమించాలంటే కేవలం ఓ చెంపదెబ్బ కొడితే సరిపోదు. అవన్నీ పాత మెథడ్లు. కత్తితో పొడవటం, తుపాకీతో కాల్చటం లాంటివి చేస్తేనే ఈనాటి ఆడది నిన్ను ప్రేమిస్తుంది. ఇదే కొత్త ఫ్యాషన్'' అన్న సెకండ్ హీరోయిన్ సలహాని తూచా తప్పక పాటించాలని నిశ్చయించుకున్న హీరో సెకండ్ హ్యాండ్ కత్తి కొనుక్కుని హీరోయిన్‌ని పొడవటానికి బయలుదేరుతాడు.

మరో పక్క హీరో తన దవడపళ్ళు ఊడగొట్టినందుకు ప్రతీకారంగా, అతన్ని నరికి పోగులు పెట్టమని హీరోయిన్ తన అన్నయ్యను పురమాయిస్తుంది.

ఎంతకాలం గడిచినా తన ప్రేమ ఫలించటం లేదన్న కోపంతో హీరో హీరోయిన్లిద్దరినీ చంపి పారేయాలని టైలర్ శివ (విలన్) బయలుదేరుతాడు. ఈ రహస్యం తెలుసుకున్న సెకండ్ హీరోయిన్ హైదరాబాద్ నుంచి తిరుపతికి వడివడిగా పరిగెత్తుతుంది.

ముందుగా హీరో హీరోయిన్ని పొడిచేస్తాడు. (*'అబ్బ నీ కత్తిపోటు దెబ్బ'* *అని ఇక్కడ ఒక పాట వేసుకుంటాం. అది వేరే సంగతి)*

అప్పుడే అక్కడికి వచ్చిన హీరోయిన్ అన్న హీరోని తుపాకీతో కాలుస్తాడు. అది చూసిన సెకండ్ హీరోయిన్ అతగాడ్ని బండరాయితో మోదుతుంది. కాలేజీ నుంచి అటుగా వెళ్తున్న హీరో చెల్లెలు సెకండ్ హీరోయిన్‌ను కత్తిపీట (!?)తో నరికేస్తుంది.

ఉరుకులు పరుగుల మీద వచ్చిన టైలర్ శివ అందరూ రక్తం మడుగులో పడుండటం చూసి పిచ్చెక్కిపోతాడు. ''ఇక్కడా నాకు అన్యాయమే జరిగింది. హాహాహాహా'' అంటూ నవ్వి, ఏడ్చి, ఉన్నట్టుండి పిస్టల్ తన కణతలకు పెట్టుకొని పేల్చుకుంటాడు.

ఢాం!

ఇంకేముంది. కథ సుఖాంతం!

బొయ్యిమంటూ పోలీస్ వ్యాను సౌండ్ విన్పిస్తుంది.

☆☆☆

హాస్పిటల్ సీన్...

కొంతసేపు అందరూ చావుబతుకుల మధ్య కొట్టుకొంటుంటారు. ఏవో కొన్ని టిక్ టిక్ శబ్దాలు, కంప్యూటర్ గ్రాఫ్లు, ఆపరేషన్ థియేటర్ దృశ్యాలు కొంచెం సేపు కన్పిస్తాయి.

ఆ తర్వాత అన్ని శవాలు (?) లేచి కూర్చుంటాయి (*ఒక్కటి తప్ప*)

☆☆☆

అప్పటికే దండ వేసి ఉన్న సెకండ్ హీరోయిన్ పటం ముందు నిలబడి హీరోహీరోయిన్లు దండలు మార్చుకుంటారు.

హీరో (*వంశాచారం ప్రకారం*)–తనను చంపకపోయినా చంపినంత పనిచేసిన హీరోయిన్ అన్నకి తన చెల్లెనిచ్చి పెళ్ళిచేస్తాడు. అన్నట్లు హీరో చెల్లెలు ప్రేమించిన 'కోన్‌కిస్కా గొట్టాంగాడు' కూడా ఇతనే! ఈ విషయం చివరివరకూ సస్పెన్స్‌గానే ఉంటుంది.

☆☆☆

శోభనం గది...

''నేనన్నట్లే నీతో చీర కట్టించాను చూశావా?'' అంటాడు హీరో కన్నుగీటుతూ.

''పోవోయ్ బడాయి. అన్నట్లుగానే నేను కూడా దీన్ని విప్పి పారేస్తున్నాను'' అంటుంది హీరోయిన్. అలా అంటూ.....

''శుభం''

☆☆☆

*(సారూ! ప్రొడ్యూసర్ సారూ! డైరెక్టర్ సారూ! ఇలాంటి కథలు నా దగ్గర ఓ ముప్పై వందలో నలభై వేలో ఉన్నాయి. సరిగ్గా లెక్కపెట్టే ఓపిక లేదు. నా ఒక్కడి దగ్గరే ఇన్నేసి ఉంటే మా రచయితలందరి దగ్గరా కలిసి ఎన్ని లక్షలు ఉంటాయో ఊహించుకోండి. కనీసం ఇప్పటికైనా మా 'టాలెంట్' ఎలాంటిదో గుర్తించి పరాయి భాషల నుంచి కాపీకొట్టడం మానేయండి. మీకు కావలసినన్ని కథలు తయారుచేస్తాం. సరిగా మీరు కావాలనుకుంటున్న రీతిలో తయారుచేసి ఇస్తాం. ఇంకా అనుమానం దేనికి. వెంటనే మమ్మల్ని పిలిపించుకోండి. మీకు కావలసిన కథలు రాయించుకోండి.)*

●

## కాలాన్ని కొలవడం ఎప్పుడు ప్రారంభమైంది?

కాలానికి ఆకారం లేదు. అగ్రాహ్యమైనది. స్పష్టం అనిపించినా వస్తురూపం లేనిది. కాలాన్ని మనం రికార్డు చేయలేం. జరిగిన సంఘటనల కాల ప్రారంభం, ముగింపు ఉంటుంది. కాబట్టి దాన్ని మాత్రమే రికార్డు చేసుకుంటాం. పూర్వం అంటే అనేక మిలియను సంవత్సరాల ముందుకూడా కాలం ఉంది. ముందు ముందు కూడా ఉంటుంది అనేది మాత్రమే స్పష్టం. ఈరోజు దానంతటది వస్తుంది. వెళ్తుంది. ఆలస్యం చేయదు. అయినప్పటికీ ఇది సదా మనతో నేడు, రేపు, ఎప్పుడూ ఉంటుంది. కాలం అనేది విరామం, వ్యవధానం, ఒక అవకాశం. ఇది కొలవడానికి కూడా వీలుకానంత వేగంగా పెరుకుపోయే అనంత విలంబం.

చాలాకాలం క్రిందట సుమారు మూడు బిలియన్ సంవత్సరాలకు పూర్వం భూమి బ్రహ్మాండమైన శూన్యంలో మిణుకుమిణుకుమనే జ్యోతిగా ప్రకాశిస్తుండేది. మొట్టమొదట పై పొర ఏర్పడినపుడు జ్యోతిగా మండుతున్న గోళం ద్రవరూపం పొంది ఘనీభవించినప్పుడు కాలం ప్రారంభమైంది. ఇక్కడే భౌగోళిక చరిత్రకు నాంది పలికింది. రెండు బిలియన్ సంవత్సరాల తరువాత మొక్క అనేది బయలుదేరి రెండు ఏకకణాలుగా విభజన పొందడానికి అలవరుచుకుంది. ఈ విధంగా భూమికి, కాలానికి పరిణామ క్రమంగానే గాక సంసిద్ధ పూర్వకంగా చారిత్రక, భౌగోళిక అవధులుగా విభజించే విధానం ప్రారంభమైంది.

ఒక మిలియన్ సంవత్సరాల తరువాత మనిషి పుట్టుక మొదలైంది. ఆ మనిషి పౌర్ణమితో కాలమానం ప్రారంభించాడు. ఖగోళం పరిశీలించాడు. పట్టిక తయారుచేసుకున్నాడు. సంవత్సరాన్ని మాసాలుగానూ, రోజులు గానూ, గంటలు గానూ, శతాబ్దాలు గానూ, దశాబ్దాలు గానూ విభజించుకున్నాడు. లయబద్ధమైన సెకండ్ల గడియారం ఏర్పాటుచేసుకున్నాడు. కాలాన్ని లయబద్ధంగా నడిచేందుకు గడియారంలో బంధించడం బాగానే ఉన్నా, జీవితం లయబద్ధంగా గడవాలంటే మాత్రం ప్రతీ సెకనునూ సద్వినియోగం చేసుకోవడం తప్పనిసరి.

**-సింధు**